సాక్షి ప్రకాశం

ఆదివారం । 24 । మార్చి । 2024



మార్కాపురం అభివృద్ధి బాధ్యత నాది

మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. పట్టణంలో ఆయన ఓట్లు అభ్యర్థించారు.

- IIలో..



నేడు పృధులగిరి తిరునాళ్ల

పృధులగిరి లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల ఆదివారం నిర్వహించనున్నారు. తిరునాళ్లకు 20 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం
35/26


వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

రంజాన్ వేళలు

ఆదివారం - ఇఫ్తార్ : సా॥ 6.25

సోమవారం - సహరీ : ఉ॥ 4.52



న్యూస్‌రీల్

ఈవీఎం గోదాము పరిశీలించిన కలెక్టర్



ఈవీఎం గోదాము పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సోమవారం స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోదామును పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన తీరుతో సీల్స్, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. దీనిలో అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఆర్‌ఓ శ్రీలత, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్ పాల్గొన్నారు.


పది పరీక్షలు ప్రశాంతం

ఒంగోలు: పదో తరగతి రెగ్యులర్, ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియెట్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర తెలిపారు. రెగ్యులర్ పదో తరగతి పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 29,356 మందికిగాను 29,103 మంది, ప్రైవేటు విద్యార్థులు 1112 మందికిగాను 515 మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్షల పరిశీలకులు డాక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ 5 సెంటర్లను, ఫ్లయింగ్ స్క్వాడ్ 92 సెంటర్లను, 6 పోలీసుస్టేషన్లలో ప్రశ్నపత్రాల భద్రత పరిశీలించారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి సైన్స్ పరీక్షకు సంబంధించి 1596 మందికిగాను 1395 మంది హాజరయ్యారని, ఫిజిక్స్‌కు 3381 మందికిగాను 3081 మంది హాజరైనట్లు తెలిపారు. పొలిటికల్ సైన్స్ పరీక్షకు 1465 మందికిగాను 1322 మంది హాజరయ్యారని, మొత్తంగా ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 4846 మందికిగాను 443 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

గురివిందా.. సత్యం దాచేసి..!

విశాఖ డ్రగ్స్ వ్యవహారంలో జిల్లా మూలాలపై వాస్తవాలను కప్పిపుచ్చుతూ అసత్య ప్రచారాలకు పూనుకుంది ఎల్లో మీడియా. ఈ వ్యవహారంలో కీలకంగా ఉన్న కోటయ్య చౌదరితో సన్నిహిత సంబంధాలు, వ్యాపార లావాదేవీలు నెరపిన టీడీపీ నాయకుడు, నారా లోకేష్ ముఖ్య అనుచరుడు దామచర్ల సత్య వ్యవహారాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు సరికదా అధికార వైఎస్సార్ సీపీపై బురదజల్లే ప్రయత్నం చేసింది. గతంలో గిరిజన యువకుడిపై దాడి చేసిన వ్యక్తిని రక్షించింది ఎవరు? మార్గదర్శి మేనేజర్ భార్య దొంగతనంపై వాస్తవాలను దాచేశాయి పచ్చ పత్రికలు.

- విశాఖ డ్రగ్స్ కేసులో దామచర్ల సత్య పాత్రపై దాటవేత
- దామచర్ల పాత్రను ఖండించకుండా అధికార వైఎస్సార్ సీపీపై అభాండాలు వేసే కుట్రలు
- ప్రజల దృష్టి మరల్చేందుకు ఎల్లో మీడియా ఆపసోపాలు
- గిరిజన యువకుడిపై దాడి కేసులో నిందితుడు చౌదరికి ఆశ్రయం ఇచ్చిందెవరు?
- మార్గదర్శి మేనేజర్ భార్య దొంగతనం, దాడి కేసులో తేలు కుట్టిన దొంగల్లా దాక్కుంది ఎవరు?
- విశాఖ లింకులపై జిల్లాలో విస్తృత చర్చ





సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్న కూనం కోటయ్య చౌదరితో దామచర్ల సత్య ఫొటో

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: దొంగే దొంగా దొంగా అన్నట్టుగా ఉంది తెలుగుదేశం పార్టీ పరిస్థితి. డ్రగ్స్ కేసులోని కీలక నిందితులతో సన్నిహిత సంబంధాలు, వ్యాపార లావాదేవీలు చేసి అడ్డంగా చిక్కుకున్నారు పచ్చపార్టీ నేతలు. వైజాగ్‌లో పట్టుబడిన డ్రగ్స్ కేసులో ఉన్న సంధ్యా ఆక్వా యజమాని కోటయ్య చౌదరితో జిల్లాకు చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అలాగే వ్యాపార లావాదేవీలు కూడా ఉన్నాయి. ఇవన్నీ శుక్రవారం ఫొటోలతో సహా హల్‌చల్ చేశాయి. జిల్లా అంతటా మత్తు వ్యాపారంపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది కూడా. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని ఎల్లో బృందం అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే కార్యక్రమానికి తెరతీసింది. ఇందులో భాగంగా ప్రజల దృష్టిని మరల్చేందుకు పచ్చ మీడియా రంగంలోకి దిగింది. ''ఈ పాపాలెవరివి జగనన్నా'' అంటూ కథనాన్ని వండి వార్చింది. ఎల్లో మీడియాలో దామచర్ల సత్య ప్రస్తావనే లేకుండా జాగ్రత్త పడింది. ఒంగోలు పరిసర ప్రాంతాల్లో జరిగిన కొన్ని నేరాలకు మసిపూసి మారేడు చేసేందుకు విఫల ప్రయత్నం చేసింది. అందులో గిరిజన యువకుడిపై జరిగిన దాడి కేసులో అవాస్తవాలను ప్రచురించారు. అదే సమయంలో నగరంలోని ఒక బ్యూటీషియన్ ఇంటిలో దొంగతనానికి పాల్పడిన ఒంగోలు మార్గదర్శి మేనేజర్ భార్య గురించి ప్రస్తావించలేదు.

అసలు సత్యం ఏమిటి...?

డ్రగ్స్ విషయంలో అసలు 'సత్య' మేంటని జిల్లా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఈ కేసులో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సోదరుడు సత్య పాత్రపై ఆ పార్టీ నాయకులు ఎందుకు వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారన్న చర్చ కొనసాగుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మీద ఆరోపణలు చేయడం మినహా దామచర్ల సత్యకు ఈ మత్తు వ్యాపారంలో కీలకంగా ఉన్న వ్యక్తితో ఎలాంటి సంబంధాలు ఉన్నాయో మాత్రం ప్రస్తావించలేదు. సత్య విషయాన్ని జిల్లా తెలుగుదేశం నాయకులు ఖండించకపోవడం గమనార్హం. దీంతో ప్రజల్లో మరింతగా అనుమానాలు బలపడుతున్నాయి. నిజానికి సత్యకు పొగాకు వ్యాపారంతో పాటుగా ఆక్వా వ్యాపారం కూడా ఉంది. ఆక్వా హేచరీ ఉంది. డ్రగ్స్ కేసులో పట్టుబడిన సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్‌కు టంగుటూరుతో పాటుగా ఉలవపాడు మండల కరేడు పంచాయతీ పరిధిలోని అలగాయపాలెంలో ఒక ప్రీ ప్రాసెసింగ్ ప్లాంటు ఉంది. ఇక్కడ ఆక్వా ఫీడ్ విక్రయిస్తుంటారు. ఈతముక్కలలో ఆంజనేయ హేచరీస్ ఉంది. దీన్ని సంధ్య ఆక్వాకు లీజుకు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇదీ కేవలం లీజేనా లేక లీజు పేరుతో తెరవెనుక వ్యాపారమా అనేది తేలాల్సి ఉంది. టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద దామచర్ల గోడౌన్లలో సంధ్య ఆక్వాకు ప్రీ ప్రాసెసింగ్ యూనిట్ ఉన్నట్లు సమాచారం. అయితే ఇక్కడ అలాంటిదేమీ లేదని, కేవలం కోడిగుడ్ల ఫ్యాక్టరీ మాత్రమే నిర్వహిస్తున్నట్లు బుకాయిస్తున్నారు. అసలు నిజాలు ఇలా ఉండగా ఇవన్నీ ఏమీ మాట్లాడకుండా ప్రజల కళ్లు కప్పి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మీద ఎదురు దాడికి దిగడం గమనార్హం. బ్రెజిల్ నుంచి భారీగా డ్రగ్స్‌ను దిగుమతి చేసిన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ చైర్మన్ వీరభద్ర చౌదరి, ఎండీ కూనం కోటయ్య చౌదరితో దామచర్ల సత్యకు వ్యాపార సంబంధాలు ఉన్న విషయం ఆధారాలతో సహా బయటపడింది.

చిన్నబాబుకు సన్నిహితం..

దామచర్ల జనార్దన్ 2014లో ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేసిన సమయంలో సత్య అన్నీ తానై వ్యవహరించారు. ఆ తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. తెలుగుదేశం మహానాడు సాక్షిగా ఇద్దరి మధ్య ఫ్లెక్సీల వివాదం నడిచింది. టీడీపీలో నెంబర్–2గా వ్యవహరిస్తున్న నారా లోకేష్ ఇద్దరి మధ్య రాజీచేసే ప్రయత్నం చేశారు. వాస్తవానికి లోకేష్‌కు సత్య సన్నిహితంగా ఉండడంతో పార్టీలో సత్య ప్రాధాన్యత పెరిగింది. పార్టీలో కీలక పదవి తోపాటు ఇటీవల ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా కూడా వ్యవహరించారు. తాజాగా విశాఖ డ్రగ్స్ మూలాలు జిల్లాలో ఉన్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరగడం, ఈ కేసులో కీలకంగా ఉన్న కోటయ్య చౌదరితో సత్యకు వ్యాపారలావాదేవీలు ఉండడంతో ఈ మరక లోకేష్‌కు ఎక్కడ అంటుతుందోనన్న భయంతో టీడీపీ నేతలు మిన్నకుండిపోతున్నారు.

గిరిజన యువకుడిపై దాడి నిందితుడు చౌదరికి ఆశ్రయం ఇచ్చిందెవరు?

నాలుగు నెలల క్రితం నగర శివారులో ఒక గిరిజన యువకుడి మీద దాడి జరిగింది. ఈ దాడి జరిగిన నెల రోజుల తరువాత ఆ దాడి తాలుకా వీడియో ఒకటి సోషల్ మీడియా ద్వారా వెలుగుచూసింది. గిరిజన యువకుడిని చితకబాదడమే కాకుండా మూత్రం పోసిన రామాంజనేయ చౌదరి వీడియో సంచలనం సృష్టించింది. గిరిజన యువకుడి మీద దాడి చేసిన చౌదరికి టీడీపీకి చెందిన ఒక కీలక నాయకుడు నగర శివారులోని కొప్పోలులో ఆశ్రయం కల్పించినట్లు ప్రచారం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే ఉద్దేశంతో టీడీపీ నాయకులే ఆ వీడియోను సోషల్ మీడియాలో పెట్టించారని తెలిసిన గిరిజనులు, పౌర సమాజం మండిపడింది. రాష్ట్రంలోని అన్నీ వర్గాల ప్రజలు ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండించారు. గిరిజనులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. నిందితుడు చౌదరిని పోలీసులు అరెస్టు చేయడంతో పచ్చ కుట్ర కథ తిరగబడింది. అలాగే ఒక బ్యూటీషియన్ ఇంట్లో మార్గదర్శి మేనేజర్ భార్య దొంగతనానికి పాల్పడిన ఘటన జిల్లాలో కలకలం సృష్టించింది. ఈ కేసు విషయాల్లో ఎల్లో బృందం ఏమీ ఎరుగనట్టుగా మిన్నకుండిపోయారు. ఇదిలా ఉండగా టీడీపీ కార్యకర్తల పరామర్శ పేరుతో కటకటాలు లెక్కిస్తున్న మార్గదర్శి కేసు నిందితులను దామచర్ల జనార్దన్ పరామర్శించడం వివాదాస్పదమైంది. ఈ ఘటనలను ఏనాడూ నామమాత్రంగా అయినా పచ్చ మీడియా ప్రస్తావించలేదు. నేడు విశాఖ డ్రగ్స్ వ్యవహారాన్ని అధికార పార్టీకి అంటగట్టేలా కథనాలు ప్రచురించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షునికిగా చేదూరి కన్నా



చేదూరి కన్నా

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు చేదూరి కన్నా ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ నేషనల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్... కన్నాకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై ఉన్న నమ్మకంతో హ్యూమన్ రైట్స్ వారు అప్పగించిన బాధ్యతను నెరవేర్చేందుకు కృషి చేస్తానని అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు పి.రాములు నాయక్, సర్పంచ్ ఆర్.అరుణాబాయి కన్నాను అభినందించారు.

పొగాకు బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలి

- పొగాకు బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు



టంగుటూరులో వేలాన్ని పరిశీలిస్తున్న పొగాకు బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు

టంగుటూరు: పొగాకు రైతులు అన్యపదార్థాలు లేకుండా బేళ్లను వేలానికి తీసుకురావాలని పొగాకు బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు సూచించారు. స్థానిక వేలం కేంద్రాన్ని శనివారం సందర్శించి, వేలం ప్రక్రియ పరిశీలించి రైతులతో సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఎం లక్ష్మణరావు మాట్లాడుతూ రైతులు పొగాకు బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా, గ్రేడు మిక్స్ లేకుండా అందించాలన్నారు. మార్కెట్ ప్రకారం పొగాకు బేళ్లను తీసుకురావాలి, కంపెనీ బయ్యర్లు మంచి ధర అందించాలన్నారు. ఆలకూరపాడు, అనంతవరం, రావివారిపాలెం, జయవరం, పాలేటిపాడు గ్రామాలకి చెందిన రైతులు 922 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 880 కొనుగోలు జరిగగా, 42 బేళ్ల తిరస్కరించారు. గరిష్ట ధర రూ.231 కాగా, కనిష్ట ధర రూ.220, సరాసరి రూ.228.41 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 23 మంది వ్యాపారులు పాల్గొన్నారన్నారు.

పారదర్శకంగా అవినీతి రహిత పాలన



ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

- మంత్రి ఆదిమూలపు సురేష్

జరుగుమల్లి: రాష్ట్రంలో ఐదు సంవత్సరాలు అవినీతి రహితంగా, పారదర్శకంగా జగనన్న పాలన అందించారని రాష్ట్ర, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ అభ్యర్థి డా.ఆదిమూలపు సురేష్ అన్నారు. జరుగుమల్లిలో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని మంత్రి సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేశామని తెలిపారు. 152 సార్లు బటన్ నొక్కి పథకాల లబ్ధిని నేరుగా ప్రజలకు అందించామన్నారు. రాబోయే ఎన్నికల్లో కొండపి నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నన్ను, ఒంగోలు పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి ని అఖండ మెజారిటీ తో గెలిపించాలని మంత్రి అభ్యర్థించారు. ఎన్నికల వ్యూహంలో భాగంగా ప్రతిపక్షాలు చేసే జిమ్మిక్కులు ప్రజలు చూస్తున్నారన్నారు. జగనన్న ఎవరికీ భయపడరని, ఆయన్ను భయపెట్టేవారు ఎవరూ లేరని తెలిపారు. ప్రభుత్వ పథకాలతో ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. తెలుగు తమ్ముళ్లు చెప్పే గ్యారంటీలతో వారు 175 సీట్లలో పోటీ చేసే పరిస్థితి లేక కేంద్రంతో పొత్తు పెట్టుకున్నారన్నారు. కొండపిలో గత రెండు పర్యాయాలు వైఎస్ఆర్ సీపీ అభ్యర్థిని గెలిపించుకోలేకపోయామని, మనమందరం సమన్వయంతో సమీక్షించుకొని, గ్రూపులకు తావు లేకుండా వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఢాకా పిచ్చిరెడ్డి, పిన్నిక శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు బత్తిన మనోహర్, మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ రామచంద్రరావు, సర్పంచి కసుకుర్తి పున్నారావు, నందనవనం సింగిల్ విండో అధ్యక్షుడు కొమ్మాలపాటి మధు, జరుగుమల్లి సింగిల్ విండో అధ్యక్షుడు దగ్గుమాటి బూసిరెడ్డి, వైస్ ఎంపీపీ పులి బిక్షాలు, సర్పంచ్‌లు నాగినేని భాస్కర చౌదరి, ఏజెర్ల ఇక్కయ్య, చెన్నారెడ్డి రామ్మూర్తి, మాజీ కన్వీనర్ పాటిబండ్ల నాగేశ్వరరావు, చుండి సురేష్, పలువురు మండలంలోని నాయకులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సురేష్

ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానే



మద్దిరాలపాడులో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

- మద్దిరాలపాడు కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో మంత్రి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: సమాజంలోని అన్ని వర్గాల ఆదరాభిమానాలు పొంది ప్రజారంజక పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ ఏర్పడటం ఖాయమని సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని మద్దిరాలపాడు గ్రామంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మేరుగు నాగార్జున మాట్లాడుతూ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి అప్పగించిన పనిని శ్రద్ధతో చేయడమే నేర్చుకున్నానని, అలాంటి నాయకుడి ఆధ్వర్యంలో మనందరం పనిచేయడం చాలా సంతోషకరమన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ జెండా మళ్లీ ఎగరేయాలని ప్రతి కార్యకర్త కోరుకుంటున్నారని, దీనికి అనుగుణంగానే అందరం సమష్టి కృషితో పనిచేయాలన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ ప్రజలకు అండదండగా ఉండటానికి జగనన్న పంపించారని, ఆయన బాటలోనే నడిచే తాను ఇచ్చిన మాట ప్రకారం ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు. సంతనూతలపాడు నియోజకవర్గ పరిశీలకుడు దేవినేని మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో సౌమ్యుడిగా పేరు పొందిన నాగార్జున సేవలు మనందరికీ అవసరం అని, ఆయనకు తోడుగా నడుద్దామన్నారు. మాదిగ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ దశాబ్దాల తరబడి వెనుకబాటు చవిచూసిన వర్గాలు నేడు జగనన్న పుణ్యాన ప్రజా ప్రతినిధులుగా, చైర్మన్లు, డైరెక్టర్‌లు గా రాణించగలుగుతున్నారంటే ఆ వర్గాల ప్రజల మీద జగన్‌మోహన్ రెడ్డి చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మద్దిరాలపాడు గ్రామానికి వచ్చిన నాయకులకు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ పాలడుగు రాజీవ్, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, లిడ్ క్యాప్, శాలివాహన, హౌసింగ్ కార్పొరేషన్ల స్టేట్ డైరెక్టర్లు కంచర్ల సుధాకర్, పేరాల చెన్నకేశవులు, కొలకలూరి విజయ్ కుమార్, ఘట్టనేని అయ్యన్న, చెరుకూరి రమేష్, పోలినేని కోటేశ్వరరావు, జమండ్లమూడి శ్రీనివాసరావు, బత్తుల ప్రసన్న, జహీర్, పాలడుగు సందీప్, కుమ్మూరి సుధాకర్, వజ్రంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఓట్లు అభ్యర్థిస్తున్న మేరుగు నాగార్జున

అప్రతిష్టపాలు చేసేందుకు టీడీపీ కుట్ర

- వంతపాడుతున్న పచ్చ మీడియా
- అసత్య కథనాలతో ఆంధ్రజ్యోతి పత్రికలో అభాసుపాలు చేస్తున్నారు
- ఒంగోలు నగర ప్రథమ మహిళగా ఉన్న నాపై దుష్ప్రచారం చేస్తున్నారు
- కబ్జాదారులతో కుమ్మక్కైన ఆంధ్రజ్యోతిపై న్యాయ పోరాటం చేస్తా
- ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: ''నన్ను అప్రతిష్టపాలు చేయటమే లక్ష్యంగా టీడీపీ నాయకులు...వాళ్లకు వంతపాడుతూ పచ్చ మీడియా తయారైంది. ప్రధానంగా ఆంధ్రజ్యోతి దిన పత్రికలో కావాలనే నాపై అసత్య కథనాలు, అవాస్తవాలు అచ్చేస్తున్నారు. నన్ను అభాసు పాలు చేయటమే లక్ష్యంగా ఆ పత్రిక కథనాలు అల్లుతోంది'' అని ఒంగోలు ప్రథమ పౌరురాలు గంగాడ సుజాత తన ఆవేదన వెలిబుచ్చారు. ఆమె శనివారం ''సాక్షి''తో తన ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో శనివారం 'పేదల ముసుగులో కబ్జా' పేరుతో కథనం ప్రచురించారన్నారు. తన ఆధ్వర్యంలో మళ్లీ అక్రమాలు...ఎన్నికల వేళ ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణాలు...ఆ స్థలం విలువ రూ.5 కోట్లకు పైమాటే...చెరువుకొమ్ముపాలెంలో వారం రోజులుగా పనులు పేరుతో ప్రచురించారని ఆంధ్రజ్యోతి కథనంపై మండిపడ్డారు. టీడీపీకి చెందిన అమృత అనే మహిళ చెరువుకొమ్ముపాలెం ప్రాంతంలో ప్రభుత్వ భూములను ఆక్రమించి ఇష్టానుసారం కబ్జా చేసి ప్లాట్లు వేసి అమ్ముకుంటున్న సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. ఆమెపై ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదులు ఇచ్చారని చెప్పారు. పోలీసులు కూడా అమృతకే మద్దతు పలుకుతున్నారని, ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ సర్వేశ్వరరావు అమృతకు మద్దతు పలుకుతూ పోలీసు అధికారులను కూడా మేనేజ్ చేస్తున్నాడని ఆరోపించారు. కబ్జాదారు అమృతతో కుమ్మక్కు అయిన ఆంధ్రజ్యోతి విలేకరి, ఫొటో గ్రాఫర్‌లు తనపై కబ్జాదారుగా అసత్య కథనాలు రాయటం విడ్డూరంగా ఉందన్నారు. వాస్తవంగా చెరువుకొమ్ముపాలెం పరిధిలోని సర్వే నంబర్–196లో 2.30 ఎకరాలను టీడీపీకి చెందిన అమృత ప్రభుత్వ భూములను కబ్జా చేసి ప్లాట్లుగా ఏర్పాటు చేసి అమ్ముకుంటూ రూ.లక్షలు ఆర్జిస్తోందని ఆరోపించారు. ఆమె ఆంధ్రజ్యోతి వాళ్లతో కుమ్మక్కయి తనపై అసత్య కథనాలు రాయిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు సంబంధంలేని వ్యవహారాన్ని తనపై బురద జల్లేలా కార్యాచరణ చేపట్టారని విమర్శించారు. బాలినేని వాసన్నకు వెన్నుదన్నుగా ఉన్నానని, కావాలనే ఆంధ్రజ్యోతి వాళ్లు తనను టార్గెట్ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వాసన్నకు ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులను దూరం చేయటానికి పచ్చ మీడియా ఒక పథకం ప్రకారం అసత్య కథనాలు అచ్చేస్తున్నారని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్నందున వైఎస్సార్‌సీపీపై బురదజల్లే కార్యక్రమానికి పచ్చ మీడియా ప్రయత్నిస్తోందన్నారు. ఆంధ్రజ్యోతి దిన పత్రికపై న్యాయ పోరాటం చేస్తానని మేయర్ గంగాడ సుజాత హెచ్చరించారు. తాను కబ్జా చేసినట్లు ఆధారాలు చూపించాలని ఆంధ్రజ్యోతికి సవాలు విసిరారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

ఒంగోలు సెంట్రల్: ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మొక్కలు నాటి సంరక్షించాలని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి కోరారు. విశ్వవిద్యాలయం ఆవరణలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పచ్చదనం–పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతమ్‌కుమార్‌దేవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉప కులపతి ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి పాల్గొని ప్రారంభించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు మాట్లాడుతూ గ్లోబెల్ వార్మింగ్ నివారణతో విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు భాగస్వాములై పనిచేసి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. అనంతరం మొక్కలు నాటారు. ప్రొఫెసర్ రాజమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఉప కులపతి, సిబ్బంది

క్లుప్తంగా

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగులుప్పలపాడు: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశం పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అమ్మనబ్రోలు గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.శైలజా ప్రియదర్శిని తెలిపారు. ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న బాలబాలికలు 5వ తరగతిలో ప్రవేశానికి, 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఏపీఆర్‌జేసీ ప్రవేశాలకు, ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఏపీఆర్‌డీసీ ప్రవేశాలకు అర్హులని తెలిపారు. ప్రకాశం జిల్లాలో 5వ తరగతి ప్రవేశాలకు బాలికలకు అమ్మనబ్రోలు, బాలురకు సంతనూతలపాడు, గణపవరం పాఠశాలలు ఉన్నాయని వెల్లడించారు. అలాగే 6, 7, 8 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లను పూర్తి చేయడానికి ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 87126 25043 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

కూలీల ఆటోను ఢీకొట్టిన లారీ

- నలుగురికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకెళుతున్న 108 వాహనం

పొదిలి రూరల్: కూలీల ఆటోను డీసీఎం లారీ ఢీ కొట్టడంతో ఆటో బోల్తాపడి నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పొదిలి మండలంలోని తలమళ్ల సమీపంలో ఒంగోలు-కర్నూలు రోడ్డుపై శనివారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బూదవాడకు చెందిన కొంత మంది పొదిలి మండలం అన్నవరానికి కూలీ పనులకు వచ్చి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళుతున్నారు. ఈ క్రమంలో పొదిలి వైపు వస్తున్న డీసీఎం.. బూదవాడ వైపు వెళుతున్న కూలీల ఆటోను తలమళ్లవద్ద బలంగా ఢీకొనడంతో కూలీల ఆటో పొలాల్లోకి దూసుకు పోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జు నుజ్జ కాగా జానకిరాములు, కోటమ్మ, చల్లగల్లు సుబ్బులు, గనిపినేని ఆదిలక్ష్మిలకు గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా వెంటనే వారిని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

మార్కాపురం అభివృద్ధి బాధ్యత నాది

- ఎమ్మెల్యే అన్నా రాంబాబు



ప్రచారంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబుతో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

మార్కాపురం: నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం అసెంబ్లీ నుంచి వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మార్కాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మార్కాపురం పట్టణంలోని 25వ వార్డులోని నెహ్రూ బజారు, గాంధీ బజారు, వెంకటరమణ స్టూడియో, మున్సిపల్ ఆఫీసు ఏరియా, మార్కెట్ సెంటరు తదితర ప్రాంతాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడుగడుగునా ఆయనకు పూలు చల్లుతూ హారతులు ఇచ్చి స్వాగతం పలికి ఈ సారి మా ఓటు మీకేనంటూ పార్టీలకతీతంగా హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ మార్కాపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో తీర్చిదిద్దుతానన్నారు. గడచిన ఐదేళ్ల కాలంలో పార్టీలకతీతంగా జగనన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను ఎవరి రెకమెండేషన్ లేకుండా అందించారని, మీకు మంచి జరిగింది అనిపిస్తే ఫ్యాను గుర్తుకు ఓటేయాలని కోరారు. ప్రతినెలా 1వ తేదీన పింఛను అందిస్తున్న ఘనత కూడా వైఎస్ జగన్‌దే అన్నారు. ఐదేళ్ల కాలంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, సంక్షేమం అభివృద్ధి సమానంగా జరిగిందన్నారు. ఇలాంటి మంచి పథకాలన్నీ అమలు కావాలంటే వచ్చే ఎన్నికల్లో మీరందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తమను ఆశీర్వదించాలని రాంబాబు విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్నం ఎండను సైతం లెక్కచేయకుండా రాంబాబు చేస్తున్న ప్రచారానికి ప్రత్యేకంగా మహిళల నుంచి విశేష స్పందన లభించింది. మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ 1,2, షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు చాటకొండ చంద్ర, నగేష్, బుశెట్టి నాగేశ్వరరావు, రంగలక్ష్మమ్మ, వనజాక్షి, దొడ్డ భాగ్యలక్ష్మి, సిరాజ్, కరీంబాషా, సెక్షావలి, డాక్టర కనకదుర్గ, తడికమళ్ల బాలసుబ్బారావు, దుర్గ, నాలి రజనీ, రోజ్‌లిడియా, రఘుపతి శివ, నజీర్ అహ్మద్, తాళ్లపల్లి ప్రసాద్, లాయర్ హరికృష్ణ, సురేష్, సుంకయ్య, రమేష్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ రాష్ట్ర మహిళా నేతలు



ఎమ్మెల్యే అన్నా రాంబాబుతో పార్టీలో చేరిన టీడీపీ మహిళా నేతలు

మార్కాపురం: టీడీపీ రాష్ట్ర మహిళా నేతలు, నాయకురాలు విజయలక్ష్మి, చెన్న లక్ష్మి, తదితరులు వారి అనుచరులతో శనివారం మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే రాంబాబు ఆహ్వానం పలికారు. పట్టణంలోని 25వ వార్డులో నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమంలో వారు ఎమ్మెల్యే అన్నా సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి తదితరులు మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో మార్కాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి అన్నా రాంబాబు, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోనే సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పారదర్శక పాలన తదితర అంశాలు చూసి పలువురు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోనికి వస్తున్నారని, వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఎటువంటి సమస్య వచ్చినా తన దృష్టికి తేవాలని, తాను అండగా ఉంటానని వారికి చెప్పారు. మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, శ్రీశైల దేవస్థాన ట్రస్టుబోర్డు సభ్యురాలు, కౌన్సిలర్ డాక్టర్ సీహెచ్ కనకదుర్గ, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు దుర్గా సాగర్, వార్డు ఇన్‌చార్జి రోజ్‌లిడియా, కౌన్సిలర్ చాటకొండ చంద్ర, తదితరులున్నారు.

నామినేషన్ల ప్రక్రియపై అవగాహన ఉండాలి

- ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు
- వర్క్‌షాప్‌తో పాటు డెమో నిర్వహించిన కలెక్టర్ దినేష్‌కుమార్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ ఎంతో ముఖ్యమైందని, నామినేషన్ల ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులు, ఏఆర్‌ఓలకు పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. శనివారం స్పందన భవనంలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఏఆర్‌ఓలకు ప్రత్యేక వర్క్‌షాప్‌తో పాటు నామినేషన్ల ప్రక్రియపై డెమో నిర్వహించారు. నామినేషన్లు స్వీకరించేటప్పుడు తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన చెక్‌లిస్ట్ అనుసరించాలన్నారు. అభ్యర్థుల ఫొటోలు గత మూడు నెలలలోపు తీసుకున్నవిగా స్పష్టంగా ఉండాలన్నారు. బ్యాలెట్ పేపర్లపై పేరు ఏ విధంగా ఉండాలో డిక్లరేషన్‌లో పొందుపరచాల్సిన విషయాలు సరిగ్గా ఉన్నాయో లేదో జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. కేవలం ఎన్నికల ఖర్చుల నిమిత్తం తాజాగా తెరిచిన బ్యాంకు ఖాతా వివరాలను కూడా నిశితంగా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. నామినేషన్లను ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల్లోపు మాత్రమే స్వీకరించాలన్నారు. ప్రతిరోజూ వచ్చిన నామినేషన్ల వివరాలను నోటీసు బోర్డులో స్పష్టంగా తెలియజేయాలన్నారు. శుభ ముహూర్తాలు, చివరిరోజు డెడ్‌లైన్ లోపు నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు వచ్చినప్పుడు ఎటువంటి వివాదాలకు తావులేకుండా మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా భద్రపరచడం ఎంతో కీలకమన్నారు. సువిధ పోర్టల్ ద్వారా కూడా నామినేషన్లు, అఫిడవిట్లు, ఎన్నికల ప్రచారానికి అనుమతులను అభ్యర్థులు కోరవచ్చన్నారు. అనుమతులు మంజూరు విషయంలో ఎటువంటి వివాదాలకు తావులేకుండా వ్యవహరించాలన్నారు. డమ్మీ నామినేషన్ పత్రాలు ఆర్‌ఓలతో నింపించి తప్పులను గుర్తించడంపై ప్రత్యేక పరీక్ష నిర్వహించారు. అభ్యర్థులకు వరుస సంఖ్యలో బ్యాలెట్ బాక్సులో పేరును కేటాయించేందుకు అనుసరించాల్సిన విధానం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ పరికరాలను అనుసంధానం చేయడంపై వర్క్‌షాప్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్ అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఉల్లంఘించకుండా చూడాలన్నారు. ఏవైనా జరిగితే తక్షణమే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సి-విజిల్ యాప్ ద్వారా వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఆర్‌ఓ శ్రీలత, ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు. వర్క్‌షాప్ అనంతరం జిల్లా ఎన్నికల కంట్రోలు రూమును పరిశీలించారు.



ఎన్నికల కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

క్షయ నివారణకు పకడ్బందీ చర్యలు

- జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ సురేష్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌కుమార్

ఒంగోలు టౌన్: జిల్లాలో క్షయ నివారణకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్ తెలిపారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా టీబీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టీబీ బ్యాక్టీరియా మైకో బ్యాక్టీరియం ట్యుబర్ కొలొసిస్‌ను కనుగొన్న మార్చి 24వ తేదీ ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 2,567 మంది క్షయ చికిత్స తీసుకుంటున్నారని తెలిపారు. వారిలో 89 మందికి హెచ్ఐవీ ఉందన్నారు. 105 మందిలో మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ (ఎండీఆర్) టీబీ సోకినట్లు గుర్తించామని వెల్లడించారు. క్షయ సోకే రేటును ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశం ఉన్న జనాభా సంఖ్యను నిర్ణయిరచడం జరుగుతుందన్నారు. 2023లో 5,148 మందిని గుర్తించాలని లక్ష్యంగా నిర్ణయించగా, 4,671 మందిని గుర్తించినట్లు తెలిపారు. 2022 లెక్కల ప్రకారం 4,711 మందిలో క్షయను గుర్తించగా, వారిలో 4,495 మందికి చికిత్స అందించడం ద్వారా వ్యాధిని నయం చేసినట్లు చెప్పారు. 95 శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ప్రస్తుతం మనం క్షయను అంతమొందించగలం అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం క్షయ నివారణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. 2025 చివరికల్లా భారత దేశంలో క్షయను పూర్తిగా నివారించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా క్షయ వ్యాధి నివారణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. దగ్గినప్పుడు నోటికి చేయి అడ్డం పెట్టుకోవాలని, ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేయరాదని, ప్రతిఒక్కరూ మాస్క్ ధరించడం మంచిదని, తద్వారా క్షయ సోకకుండా, ప్రబలకుండా చేయవచ్చని వివరించారు. అలాగే, రెండు వారాలకు మించి దగ్గుగానీ, జ్వరంగానీ వస్తుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. దగ్గుతో పాటుగా రక్తం పడినా, ఆకలి మందగించడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే క్షయ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి సోకిన తర్వాత చికిత్స చేయించడం కంటే కూడా వ్యాధి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమ మార్గమని అన్నారు.

నేడు పృథులగిరి లక్ష్మీనృసింహ స్వామి తిరునాళ్ల



లక్ష్మీనృసింహ స్వామి మూలవిరాట్



లక్ష్మీనృసింహ స్వామి ఉత్సవ మూర్తులు

మర్రిపూడి: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీ పృథులగిరి లక్ష్మీ నృసింహస్వామి తిరునాళ్లకు ఏర్పాట్లు అన్ని పూర్తి అయినట్లు ఈఓ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నారాయణం మారుతీచార్యులు, శ్రీనివాసాచార్యులు స్వాములవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. స్వాములవారిని హనుమంత వాహనంపై ఘనంగా ఊరేగించారు. గంధ్రకోట లక్ష్మీన్నారాయణ బ్రదర్స్ ఉభయదాతలుగా వ్యవహరించారు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీ పృధులగిరి లక్ష్మీనృసింహస్వామి రాజ్యలక్ష్మీ సహితులై భక్తజనులను ఉద్ధరించేందుకు స్వయంభూలైవెలసిన స్వాములవారిని దర్శించుకునేందుకు లక్షల సంఖ్యలో తిరునాళ్లకు వచ్చేందుకు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు.

గరుడోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తిరునాళ్ల అత్యంత వైభవంగా జరుగనుంది. ఈ గరుడోత్సం కార్యక్రమానికి అలవల వెంకట నర్సింహం అన్నదమ్ములు ఉభయదాతలుగా వ్యవహరించనున్నారు. ఈ గరుడోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ, ఆంధ్ర, తమిళనాడు తదితర సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో కొండ పైకి చేరుకుని మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు పేర్కొన్నారు. తిరునాళ్ల సందర్భంగా కొండపైకి చేరుకున్న భక్తులకు తాగునీరు, అన్నదానం, భక్తుల సౌకర్యార్థం నీడ కోసం టెంట్లు తదితర వసతులు ఏర్పాటు చేశామన్నారు. స్వాములవారిని దర్శించుకునేందుకు భక్తులు ఇబ్బందులు పడకుండా బారికేట్లు ఏర్పాట్లు చేశామన్నారు.

తిరునాళ్లకు 20 ఆర్టీసీ బస్‌ల ఏర్పాటు

లక్ష్మీనసింహ స్వామి తిరునాళ్లకు 20 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు పొదిలి డిపో మేనేజర్ జె. సుందరావు తెలిపారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పొదిలి నుంచి మర్రిపూడి మీదుగా కొండ వరకు చేరుకునేందుకు 15 బస్సులు, పొదిలి నుంచి రాజుపాలెం మీదుగా కొండ వరకు 5 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

పోలీస్ బందోబస్త్

తిరునాళ్ల సమయంలో కొండపై ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు మర్రిపూడి ఎస్‌ఐ శివబసవరాజు తెలిపారు. మర్రిపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి వీరబాబు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నామన్నారు.



పృథులగిరి లక్ష్మీనృసింహ స్వామి తిరునాళ్లకు ముస్తాబైన ఆలయం